# క్రొత్తకాపురం

శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు

సోమశేఖరరావు—సిజుఆలో ఒక పెద్ద బొగ్గుగనికి అసిస్టెంటు మేనేజరుగానుండి క్రొత్తగా పెండ్లి చేసికొనివచ్చిన తన స్నేహితుడు సుందరాన్ని చూడాలని బయలుదేరాడు. కలకత్తానుంచి ధన్‌బాదులో రైలుమారాడు. డూప్లికేటులో వెడుతోన్నాడు సిజుఆకు. దారిపొడవునా పచ్చని పైరుగాని, చక్కని చెట్లుగాని, యిండ్లుగాని యేమీ కనబడడం లేదతనికి. ఎక్కడ చూసినా పొడవుగా పేర్చబడి మండుతోన్న బొగ్గుల గుట్టలే. ఆకాశమంతా పొగ క్రమ్మియుంది. మొదట మండుతోన్న ఒకటి రెండు గుట్టలనుచూచి కాలుతోన్న శవాలేమో అనుకొన్నాడతను. అదంతా శ్మశానమనుకొన్నాడు. చుట్టు ప్రక్కల నెక్కడా ఊరు కనబడదే, మనుష్య సంచారమైనా ఆట్టే లేదే, ఇక్కడింత శ్మశానవాటిక ఉంటుందా అనుకొన్నాడు. రానురాను ఎక్కడ చూచినా మంటలే. మధ్యమధ్య కాలి చల్లారిన బొగ్గుల గుట్టలుకూడా ఉన్నాయి. అప్పుడు తెలిసికొన్నాడు ఇది శ్మశానంకాదు బొగ్గుగనుల సమీపంలో కోకును తయారుచేసే ప్రాంతమని.

సిజుఆ స్టేషను వచ్చింది. తన స్నేహితుణ్ణి ఎదుర్కొనుటను సుందరం స్టేషనునకు వెళ్లాడు. ఇరువురూ సరదాగా కబుర్లు చెప్పుకొంటూ వెడుతున్నారు. రోడ్డంతా నల్లగా బొగ్గుమసి. రోడ్డు ప్రక్కల్ని బూడిదగుట్టలు, బొగ్గుగుట్టలు, కాలుతోన్న బొగ్గురాసులు. ఇంతకుమించి యింకేమీ కనబడడంలేదు. సుందర్రావు ఎంతో సరదాగా, సంతోషంగా చెబుతోన్న కబుర్ల మధ్య అతనేమీ మాట్లాడకుండా వింటూ వెడుతోన్నాడు.

ఇంటికి వచ్చారు. వీధిలో కొళాయిదగ్గర కూలివాళ్ళు స్నానాలు చేస్తోన్నారు. ఎత్తు పళ్ళు, నల్లటి శరీరాలు, కాంతిలేని కళ్ళు, రుప్పలవలె నున్న జుట్లు, శరీరం కన్న మసిపారియున్న గుడ్డలు. అప్పుడే గనిలోనుండి వచ్చి కొళాయి వద్ద స్నానం చేస్తున్నారు. మగ ఆడ అను భేదం లేకుండా అంతాకలిసి కబుర్లు చెప్పుకొంటూ, నవ్వుకొంటూ, ఒకళ్లమీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకొంటూ అతి సరదాగా స్నానాలు చేస్తున్నారు వాళ్ళు. ఆడవాళ్లకు పైన పైటలులేవు. పైటలు లేవనే భావంకూడా వాళ్లకులేదు. సోమశేఖరానికిదంతా చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది. రావణాసురుని లంకలోని రాక్షసులా అనిపిస్తోంది వాళ్లని చూస్తే.

కలకత్తాలో ఆ చక్కని తారురోడ్లు, ఆకాశమును ముద్దుపెట్టుకొనే మేడలు, కన్నులపండువ చేయు పార్కులు, చిత్రకళా మందిరాలు, మంచి మంచి షాపులు, చక్కగా దిద్దుకొని రంగు రంగుల దుస్తులతో సీతాకోక చిలుకల్లాగు ఇంద్రధనస్సుల్లాగ తిరిగే సౌందర్యవంతులగు స్త్రీపురుషులు మొదలైన అందమైన దృశ్యాలనే

ఎల్లప్పుడూ చూస్తోన్న ఆ కళ్లకు ఇదంతా అతి అసహ్యముగా కనబడుతోంది అతనికి. అతి చక్కని వాడు తన స్నేహితుడు. అంతకన్నా రూపసి అతని భార్య. అందంకోసం వాళ్ళు పడే టంత తాపత్రయం ఇకెవరూ పడతారనుకోను. అందమైన దృశ్యాల్నే కాని మరోదృశ్యాల్ని చూచి సహించలేరు ఆ దంపతులు. ఆలాంటి వాళ్ళు ఈలాంటి ప్రదేశంలో ఏలా నివసిస్తొన్నారా! అని అతని ఆశ్చర్యం.

లోపలికి తిన్నగా డ్రాయింగు రూములోకి వెళ్లారు. పోలిషు చేసి క్రొత్తగానున్న కుర్చీలు, సోఫాలు, మధ్యనొక పెద్ద గుండ్రని టేబిలు, దానిమీద ముద్దులు మూటకడుతో అతి సున్నితంగా కుట్టబడిన ఎంబ్రాయిడరీ టేబిలు క్లాత్తు, గుమ్మాలకూ, కిటికీలకూ రకరకాల చిత్రవిచిత్ర మైన ఎంబ్రాయిడరీకర్టెన్లు అక్కడి గోడలకు తగిలించి యున్నవి. ఫొటోలు కావు. బజార్లో కొన్న పెయింటింగులూ కావు. భార్యాభర్త లిరువురచే వ్రాయబడిన రకరకపుల చిత్తరువులు. పైన పంకా తిరుగుతోంది. మంచి పవరు కలిగిన Sixty wats ఎలెక్ట్రిక్కు దీపాలు నాలుగు వెలుగుతోన్నాయి. టేబిలుమీది ఫలహారాల ప్లేట్లమీద చక్కని లేసులు కప్పియున్నాయి. ఒక చోట చాపమీద భూలోకంలోకి దిగి వచ్చిన సరస్వతీదేవియా యనునట్లు మెరిసి పోతూ హాయిగా వీణ వాయించుకొంటూ తన భర్త రాకకు ఎదురుచూస్తూ కూర్చున్నది కళాదేవి. సోమశేఖరం ముగ్ధుడై నిలబడిపోయాడు కళాదేవి వీణ నక్కడ పెట్టి వారి కెదురుగావచ్చి వచ్చారా రండి రండని ఆహ్వానించింది వారిని.

ముగ్గురూ కుర్చీలలో కూర్చుండి ఫలహారం చేస్తున్నారు. "సుందరం! పదార్థాలన్నీ చాలా రుచిగానున్నాయి. మంచి వంటవాడెవరైనా ఉన్నాడా మీకు?" అని అతను అడిగాడు.

"ఈ వూళ్లో వంటవాళ్ళుకూడా దొరుకుతారా? ఇవన్నీ మా ఆవిడ తయారు చేసినవే."

"ఈ డోరుకర్టెనులన్నీ మీ ఆవిడ కుట్టినవేనా? ఏ కంపెనీలోనైనా కొన్నారా?"

"ఆమె కుట్టినవే."

"పెయింటిగ్సు అన్నీ ఒరిజనల్సు సంపాదించావే. ఏలావచ్చాయి?"

"నేను వేసినవి కొన్ని, మా ఆవిడ వేసినవి కొన్ని." సోమశేఖరాని కాశ్చర్యం ఎక్కువయింది.

"సుందరం నీ వెంత అదృష్టవంతుడవోయి సార్థక నామధేయ, కళామూర్తి ఈ కళాదేవిని భార్యగా బడయుటకు. మీ రిరువురు ఇంత సౌందర్యమూర్తులు, సౌందర్య పిపాసులు, కళోపాసకులు, ఉన్నత విద్యావంతులు, ఉన్నతాశయములు గలవారు ఈలాంటి ప్రదేశంలో ఏలా కాపురం చేస్తొన్నారు?"

"మనస్సు కలిసిన స్నేహితులుగాని దంపతులుగాని ఒకచోట నున్నప్పుడు అడవే ఉద్యానవనమవుతుంది. పూరిగుడిసే రాజప్రాసాద

పోతుంది. అందము ప్రేమించే వాళ్లకు అన్నిటిలోను అందమే కనబడుతుంది. రవీంద్రనాథ టాగూరు గడ్డిపరక నెంతో చక్కగా వర్ణించాడు. పెద్ద ఉద్యోగాలు కావాలి పెద్ద పట్టణాలలోనే నివసించాలి అంటే ఏలావస్తాయి. ఈ నిరుద్యోగపు రోజుల్లో మాకిదే బాగుంది. హాయిగా ఉంది. ఒకళ్లజోలి ఒకళ్లసొంత మా కక్కరలేదు. హనీమూన్ ఎంజాయి చేస్తున్నాం హాయిగా.

“పితృవాక్యపరిపాలనకొఱకు సీతారాములు, మాట నిలుపుకొనుటకొఱకు నలదమయంతులు, సత్యవాక్య పరిపాలన కొఱకు చంద్రమతీ హరిశ్చంద్రులు అరణ్యములోనే భూలోక స్వర్గ మనుభవించారు. దేశ సౌభాగ్యమును కోరే మేము ఈ బొగ్గుల గనుల మధ్య నందన వనమును నిర్మించుకొంటొన్నాం” అంది కళాదేవి నవ్వుతో.

★


# రీటా హెయిర్ టానిక్

## తల వెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్‌టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూ దేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు.

**RITA**
**HAIR TONIC**

